క్లుప్తంగా

రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీ బోల్తా



మానవపాడు: అంతర్రాష్ట్ర రహదారిపై ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడ్డ సంఘటన మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూల్ మండలంలోని ఆర్.కె దుద్యాల గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ మొక్కజొన్న సంచులను ఉండవెల్లి మండలంలోని ఓ కంపెనీలో అమ్మడానికి ట్రాక్టర్‌పై మానవపాడు మండలం మీదుగా వెళ్తున్నాడు. అంతర్రాష్ట్ర రహదారిలో చంద్రశేఖర్‌నగర్ గ్రామ శివారు వద్ద పట్టా విరిగి ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో ఉన్న దాదాపు 40 మొక్కజొన్న సంచులు కిందిపడ్డాయి. మొక్కజొన్న సంచుల్లో గింజలు చల్లాచెదురుగా పడ్డాయి. ఈ సంఘటనపై పోలీస్‌లను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బండలాగుడు పోటీ నిర్వాహకులపై కేసు

ఉండవెల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో పశుబల ప్రదర్శన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న పలువురిపై కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మారమునగాల–1, బొంకూరులో అనుమతి లేకుండా ఎద్దుల బండ పందేలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా ఎద్దుల బండ పందేలు నిర్వహించడంతో జంతు హింస చట్టం ప్రకారం మారమునగాల–1 లో ఆరుగురిపై, బొంకూరు గ్రామంలో మరో ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని బీ వీరాపురం గ్రామ సమీపంలోని కృష్ణానది నుంచి ట్రాక్టర్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ క్రమంలో బీ వీరాపురం సమీపంలో పోలీసులు తనిఖీ చేసి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని, పీఎస్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని గ్రామస్తుల వేడుకోలు

గట్టు: చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు 'ఇళ్లు నిర్మించుకున్న భూమి మాది' అంటూ ముగ్గురు వ్యక్తులు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన వ్యవహారం 'సాక్షి' కథనం ద్వారా బయటకు వచ్చింది. ఈ వ్యవహారం చర్చాంశనీయంగా మారింది. గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో ఆర్డీఓ రామచందర్, తహసీల్దార్ సరితారాణిలు ఇటీవల గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఆర్డీఓ, తహసీల్దార్ గ్రామాన్ని సందర్శించిన సమయంలో కొంతమంది గ్రామస్తులు అందుబాటులో లేకుండా పోయారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పత్రాలు, అనుమతి పత్రాలు, పన్ను రశీదులతో పాటు కోర్టు కేసుకు సంబంధించిన పత్రాలు అందజేయాలని గ్రామస్తులకు అధికారులు సూచించారు. దీంతో కోర్టు కేసు పత్రాలతో పాటుగా ఇతర పత్రాలను డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి అందజేశారు. గ్రామాన్ని ఖాళీ చేయించకుండా తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు విన్నవించారు.

పందులను తరలించండి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో ఇండ్లమధ్యనే పెంపకందారులు పందులను విచ్చలవిడిగా పెంచడం వల్ల నిత్యం ఇళ్ల చుట్టూ స్వైరవిహారం చేస్తున్నాయని, మురుగు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఎర్రవల్లి చౌరస్తా వాసులు వాపోతున్నారు. గ్రామంలో పందుల సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల వల్ల గ్రామంలో మురుగు పెరిగి నిత్యం కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. దీనివల్ల ఏ రోగం ముంచుకొస్తుందోనని నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని గ్రామంలో పెరుగుతున్న పందులను దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

అమరచింత: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహించి నాకబందితో అవగాహన కల్పించామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తనిఖీలు చేస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు, వాహనాలకు సంబంధించిన ఆర్‌సీలను పరిశీలిస్తున్నామన్నారు. అక్రమంగా నగదును తరలిస్తే స్వాధీనం చేసుకోవడంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఇంకుడు గుంతలే ఆధారం

- అడుగంటిన భూగర్భ జలాలు
- నిరుపయోగంగా మారిన గుంతలు
- నిర్వహణ మరిచిన అధికారులు
- పెరుగుతున్న నీటి కొరత



చెన్నిపాడులో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది(ఫైల్)

మానవపాడు: భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపకరించే ఇంకుడు గుంతల నిర్వహణ మండలంలో మర్చిపోయారు. వాటికోసం తమ వంతు ప్రయత్నం చేయాల్సిన అధికారులు గడిచిన ఏడేళ్లలో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వేసవికాలం రాక ముందు ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు తవ్వాలో గుర్తించి స్థలాలను ఖారారు చేసేవారు. ఎండాకాలం ప్రారంభం కాగానే ఆయా స్థలాల్లో వాటిని ఏర్పాటు చేసేవారు. వర్షాకాలం నాటికి అవన్నీ సిద్ధంగా ఉండటంతో వర్షపునీరంతా వాటిలోకి వెళ్లి భూగర్భ జలాలు పెరిగేవి. నేడు ఇంకుడు గుంతలు పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారి, మరికొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలోకి చేరాయి.

ఎందుకింత నిర్లక్ష్యం..

గతంలో మండల అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటులో కాలనీవాసులను భాగస్వాములను చేశారు. భూగర్భజాలల సంరక్షణకు కాలనీవాసులు ముందుకొస్తే తాము ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తామని, వాటి సంరక్షణకు ఇంటి వద్ద అయితే ఇంటి యాజమాని, చేతి పంపుల వద్ద మంచినీటి ట్యాంకుల వద్ద అయితే కాలనీ సంఘాలు, ప్రతినిధులు చూడాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇంకుడు గుంతలపై ఆసక్తి ఉన్నవారు నేరుగా ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుంటే ఏర్పాటు చేస్తామని



చెన్నిపాడులో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసిన అధికారులు (ఫైల్)

హామీ ఇచ్చేవారు. గతంలో ప్రతి చేతి పంపు వద్ద, బోర్లు, ట్యాంకులు, ప్రభుత్వ, ప్రైవైట్ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో అవి పూర్తిగా ధ్వంసంకగా మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయడంతో చాలా ఇంకుడు గంతలు కనపడకుండా పోయాయి. ఇప్పుడు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసే పరిస్థితి లేదు.

గ్రామాల్లో కానరాని ఇంకుడు గుంతలు..

మండలంలో దాదాపు 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 3వేల దాకా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేశారు. గతంలో అధికారుల ఆదేశానుసారం ఇంకుడు గుంతలు తవ్వారు. అవి తూతూ మంత్రంగా తయారయ్యాయి. ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడంలో పర్యవేక్షణ కోరవడటం, అధికారులు క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఇంటికో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులు చెబుతున్నా, నేడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇంటి నిర్మాణం చేపడుతున్నారంటే ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. గ్రామాల్లో సైతం భూగర్భ జలాలు కనపడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి.

ఇంటికో ఇంకుడు గుంత తప్పనిసరి



భూగర్భ జలాలను సంరక్షించడానికి ప్రభుత్వం చేపడుతున్న ఇంకుడుగుంతల నిర్మాణంలో తప్పనిసరిగా ఇంటికో ఇంకుడుగుంత ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం గాలికోదిలేశారు. ఇంకుడుగుంతల పర్యవేక్షణ కొరవడింది. ఉన్నతాధికారులు చొరవ చూపి ఇంకుడుగుంతలను ఏర్పా టు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, మానవపాడు

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి



ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్న తరుణంలో తప్పనిసరిగా ఇంకుడుగంతలను ఏర్పాటు చేసుకోవాలి. వాటి ఏర్పాటుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే తప్పనిసరిగా ఇంకుడుగుంతను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఇచ్చాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మానవపాడు

అంబేద్కర్ పండుగ జయప్రదం చేయండి

ఎర్రవల్లిచౌరస్తా: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే అంబేద్కర్ ఆలోచన పండగను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఆర్మీ అధికారి ఆకెపోగు రాంబాబు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని వివిధ గ్రామాలను అంబేద్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేద్కర్ ఆలోచన పండగ గురించి ప్రజలకు వివరించారు. ఈ నెల 12న గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ వారసులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, భాస్కర్, నాగరాజు, హనుమంతు, రామున్న, రాజు, మునెప్ప, సాలన్న, తదితరులు ఉన్నారు.

దస్తగిరయ్య దర్గాలో ప్రత్యేక పూజలు



రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో దస్తగిరయ్య ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది పండుగకు ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా బుధవారం దర్గా వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

రంజాన్ నెలవంక దర్శనం



మానవపాడులో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

మానవపాడు: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగ నెలవంక బుధవారం దర్శనం ఇచ్చింది. 30 రోజులుగా ఉపవాస దీక్షలు గురువారంతో ముగియనున్నాయి. నెలరోజుల ఉపవాస దీక్షలు విరమించుకొని పండుగ ఘనంగా నిర్వహించనున్నట్లు మతపెద్దలు తెలిపారు. మసీదులలో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించా రు. పండుగకు మసీదులు ముస్తాబు చేశారు. కార్యక్రమంలో మహ్మద్, ఖాలీమ్, ముస్లింలు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

శాంతినగర్: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. అలంపూర్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు కలీముల్లా ఆధ్వర్యంలో కిట్లు అందజేశారు. నూతన వస్త్రాలు, నిత్యవసర సరుకులు అందించినట్లు తెలిపారు. నిరుపేదలు పండగ పూట ఉపవాసం ఉండకూడదనే సంకల్పంతో కిట్లు పంపిణీ చేసినట్లు కలీముల్లా పేర్కొన్నారు. అందరు సోదర బావంతో మెలిగి సుఖ సంతోషాలతో పండుగ చేసుకోవాలని ఆయన కోరారు. లేని వారికి దాన, ధర్మాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరుపేదలకు కిట్లు అందజేస్తున్న కలీముల్లా

రంజాన్‌కు ముస్తాబైన మసీదులు

రాజోళి: ముస్లింల పవిత్ర రంజాన్ పండుగకు గ్రామాల్లో మసీదులు ముస్తాబు చేశారు. మండల కేంద్రంలో, ఆయా గ్రామాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున బట్టల షాపులు, కిరాణ షాపుల వద్ద షాపింగ్ చేశారు. మసీదుల వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో జోరుగా ఉపాధి పనులు



ధరూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని ర్యాలంపాడు, దోర్నాల తదితర గ్రామాల్లో పనులు జోరుగా జరుగుతున్నాయి. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలు ఉదయం 6.30 గంటలకే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎలాంటి పనులు లేకపోవడంతో ఉపాధి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పనుల ప్రాంతాల్లో చలువ పందిళ్లు వేయాలని ఆయా గ్రామాల ఉపాధి కూలీలు కోరుతున్నారు.

'నాణ్యతలేని మాంసం విక్రయిస్తే చర్యలు'

వనపర్తి టౌన్: మాంసం విక్రయాల పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించమని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో మాంసం విక్రయాలు జోరుగా సాగుతుండటంతో ఉదయం 6 గంటల నుంచి మున్సిపల్ జవాన్లతో కలిసి మాంసం విక్రయ కేంద్రాలు, జంతు వధ శాఖలలో జీవాలను వధిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మర్రికుంట రహదారి, మారెమ్మకుంట టర్నింగ్ వద్ద, గాంధీ చౌక్, పాతబజార్‌లో విక్రయ కేంద్రాల్లో మాంసం నాణ్యతను పరిశీలించారు. మర్రికుంట సమీపంలో పలు చోట్ల అనారోగ్యంతో ఉన్న జీవాలను వధించడంతో వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటుగా ఆరోగ్యకరమైనవి ఎలా గుర్తించాలో ప్రజలకు ప్రత్యక్షంగా చూయించారు. మాంసం కొనేటప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. మర్రికుంటలోని మరో వ్యాపారి ఆరోగ్యకరంగా వధించిన జీవి మాంసాన్ని, అనారోగ్యకరమైన మాంసాన్ని రెండింటిని కలిపి విక్రయించడంపై ఆయన మండిపడ్డారు. వ్యాపారులను రెడ్ అలర్ట్‌లో ఉంచుకొని, మరోసారి తప్పు జరిగితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు ఆ మాంసాన్ని విక్రయించకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు, ప్రత్యేక వారాల్లో మాంసం కొనేటప్పుడు ప్రజలు తొందరపడొద్దని, అన్ని రకాలు పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు లాభాపేక్ష కోసం ఇష్టానుసారంగా వ్యవహరించి ప్రజల అనారోగ్య సమస్యలకు కారణమైతే ఊరుకోమన్నారు. తూకాల్లో మోసాలు, వ్యత్యాసాలు లేకుండా విక్రయాలు సాగించాలని ఆదేశించారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు!



గద్వాల-రాయచూరు రహదారిలో పగలు 9గంటల సమయంలో వెలుగుతున్న వీధి లైట్లు



ధరూరులోని వైఎస్సార్ చౌరస్తాలో పగలే వెలుగున్న హైమస్ట్ లైట్లు

ధరూరు: ప్రాజెక్టుల్లో నీళ్లు లేక అంతంత మాత్రంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్న తరుణంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రోడ్ల వెంట వీధి లైట్లతో పాటు నాలుగు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లు వెలుగుతూనే కనిపిస్తున్నాయి. వీధి లైట్ల కోసం ప్రత్యేకంగా ఫీజులు ఏర్పాటు చేసినా అధికారులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వీధి లైట్లు పట్ట పగలు వెలుగుతుండడంపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

బ్రాహ్మణులకు సన్మానం

వనపర్తి టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో వెంకటయ్య అధ్యక్షతన బ్రాహ్మణులు నాయకంటి నరసింహాశర్మ, లక్ష్మీనారాయణ చార్యులు, మధుసూదన్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మలను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు క్రోధి నామ సంవత్సరం పంచాంగాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్, డైరెక్టర్ కురుమూర్తి, సభ్యులు తిరుపతయ్య, శాంతమ్మ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము పాల్గొన్నారు.



తిక్కతాత రథోత్సవంలో ఎమ్మెల్యే

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి తిక్కతాత రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగతో పాటుగా తిక్కతాత ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి రథోత్సవం దగ్గరకు చేరుకుని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటన్నగౌడు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

వడదెబ్బ నుంచి రక్షించుకోండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివతేజ

అయిజ: వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకొని తమను తాము రక్షించుకోవాలని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ శివతేజ సూచించారు. బుధవారం మండలంలోని భూంపురం లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో వడదెబ్బపై అవగాహన కల్పించారు. వడదెబ్బ తగులకుండా ఉండేందుకు వీలైనంత వరకు ఉదయం 11నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఎండలోకి వెళ్లరాదని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లాల్సి వస్తే తలపై గొడుగు, టోపీ, వస్త్రం యేదో ఒకటి పెట్టుకోవాలని సూచించారు. వీలైన న్ని సార్లు మంచినీరు తాగాలని, కొబ్బరి బొండా లు, మజ్జిగ తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తులను నీడలోకి తీసుకెళ్లి చల్లటి నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరంపై తుడవాలన్నారు. చల్లటి గాలి తగిలే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా వారిని ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు తి మ్మప్ప, మనివర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయుడు భీమేశ్వర్ రెడ్డి, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ వర్కర్ చెన్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన కె.ఆంజనేయులు, వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జూలెకల్ ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ పోటీలు శుక్రవారం ముగుస్తాయని ని ర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్వర్‌బాషా, శేఖర్, చాంద్‌బాషా, ఐదు జట్ల సభ్యులు పాల్గొన్నారు.



జూలెకల్‌లో క్రికెట్ ఆడుతున్న యువకులు

ప్రమాదకరంగా కల్వర్టులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఇటిక్యాల, ఎర్రవల్లిచౌరస్తా నుంచి గార్లపాడు వెళ్లే రోడ్లపై పలు కల్వర్టులు కూలిపోయి ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ దారుల్లో పదుల సంఖ్యలో గ్రామాలు ఉండటం వల్ల రోడ్డు ప్రతి రోజు రద్దీగా ఉండటంతో ఎక్కడో ఒకచోట కల్వర్టులపై ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. గార్లపాడు, సాసనూలు, చాగాపురం, ఇటిక్యాల గ్రామాల సమీపంలో కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు బిక్కు బిక్కుమంటూ నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికై న ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



సాసనూలు దగ్గర గుంతలతో కూలిన కల్వర్టు

వేతనాలు రాక అప్పులే శరణ్యం



ఎంపీఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

- నెలల తరబడి పెండింగ్‌లో జీతాలు
- అప్పులతో పండగ చేసుకునే పరిస్థితి
- పనులు పక్కాగా చేయాలని అధికారుల ఆదేశాలు

ఉండవెల్లి: చేసిన పనికి వేతనాలు రాక, బయట అప్పులు పుట్టక గ్రామ పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల ఈ సారైనా తమకు జీతాలు వస్తాయని ఎదురు చూడడం.. తీరా రాకపోయేసరికి నిరుత్సాహ పడడం వారికి పరిపాటిగా మారింది.

మొత్తం 150 మంది సిబ్బంది..

మండలంలో మొత్తం 150 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 7నెలలుగా జీతాలు రావట్లేదని కలెక్టర్‌కు, అధికారులకు విన్నవించుకున్న ఇంతవరకు పట్టించుకోలేదు. జీతాలు రాకపోవడంతో పండగలకు అప్పులు తెచ్చుకుని గడుపుతున్నారు. ప్రతినెల గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సిందే. కాని ఇప్పటికి జీతాలు రాని పరిస్థితి నెలకొంది. సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లించడం సాధ్యం కావడం లేదని అధికారులు సిబ్బంది జీతాల చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారు.

ఉదయాన్నే పనికి..

ఉదయాన్నే పనులకు వస్తున్నా పట్టింపులేక తీవ్రత పట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి ప్రమాద భీమాలు కూడా లేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారు. దాదాపు 40 డిగ్రీల పైనే ఎండల తీవ్రత ఉన్నా మేజర్ పంచాయతీల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం పనులను చేయిస్తు వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులను అడిగిన కొందరు అందులో ఉన్న సిబ్బంది పనులు చేయాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నట్లు కార్మికులు తెలిపారు. కార్మికుల కుటుంబాలలో చెత్త రిక్షా వ్యక్తులు, మహిళలకు, విద్యుత్, నీటి కార్మికుల సిబ్బందికి మధ్యాహ్న సమయంలో మినహాయింపు ఉండాలని వినతులు అందజేశారు. కార్మికులకు సహకరించాలని కోరుతున్నారు.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

పని ఎంతో పస్తులు అంతా..



ఉదయం నుంచి కార్మికులం పనులు చేస్తున్నా. ప్రతిరోజు పనులకు వెళ్లి చెయ్యాలి. ఎలాంటి సిగ్గు ఎగ్గు ఆలోచించకుండా పనులు చేస్తున్నాం. కాని ఇప్పటికి 6 నెలలుగా జీతాలు రావడం లేదు. ఒక్కోసారి అప్పులు చేస్తున్నాం . మరోకసారి పస్తులు ఉంటున్నాం. పండుగలు చేసుకోని పరిస్థితి నెలకొంది.

– పరుశరాముడు, కంచుపాడు కార్మికులు

అప్పులు కట్టలేక పోతున్నాం..

నాలుగు నెలలుగా జీతాలే రావడం లేదు. రోజు పను లు చేస్తున్నాం. అధికారులకు తెల్పిన రాలేదని తెలుపుతున్నారు. జీతాలు రాకపోవడంతో అప్పులు తెచ్చుకుంటున్నాం. వడ్డీల బారం అధికమవుతున్నాయి. మా ఇంట్లో మా నుంచే ఆధారపడే పరిస్థితి నెలకొంది. పండగలు చేసుకోవాలంటే అప్పు చేయ్యాల్సి వస్తోంది.

– పద్మమ్మ, కార్మికురాలు

త్వరలో వేతనాలు అందుతాయి..

పంచాయతీ కార్మికులకు జీతాలు పడడంలేదనేది వాస్తవం. కానీ నిధులు వచ్చాయి. జీతాలు వేస్తున్నాం. కొన్ని సిగ్నల్, సెలువుల వల్ల లేట్ అవుతున్నాయి.

– పద్మావతి, ఎంపీఓ, ఉండవెల్లి